క్లుప్తంగా

ఇంగ్లిష్ కలిపిరాతపై శిక్షణ



గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు ఇంగ్లిష్ కర్సివ్ రైటింగ్(కలిపి రాత)పై శిక్షణ ఇచ్చారు. ఇంగ్లిష్ చదవడంతో పాటు రాయడంలో కూడా నైపుణ్యం ప్రదర్శించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎం.ఇశ్రాయిల్ అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉద్యోగులు టి.ప్రవల్లిక, పి.శాంతి, వి.సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాలు

పమిడిముక్కల: మండలంలోని అగినపర్రు, కపిలేశ్వరపురం, పమిడిముక్కల, గురజాడ, మేడూరు శాఖా గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి. అగినపర్రు గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తకాలు చదివించారు. కథలు చెప్పించారు. రాష్ట్రాలు– రాజధానులపై అవగాహన కల్పించారు. క్యారమ్స్, చెస్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేసినట్లు గ్రంథపాలకురాలు బొబ్బా లావణ్య తెలిపారు.

చురుగ్గా ఉపాధి హామీ పనులు



జుఝవరం(పామర్రు): మండల పరిధిలో ఉపాధి హామీ పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో పొలురాజు అన్నారు. జుఝవరం గ్రామంలో జరుగుతున్న చెరువు అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో చెరువు గట్టు పటిష్ఠ పరిచే విధంగా ఉపాధి పనులు నిర్వహిస్తున్నామని అన్నారు. రోజుకు సుమారుగా 650 మంది పని చేస్తున్నారని చెప్పారు. ఉపాధి కూలీలకు తాగునీటికి, నీడకు తగుఏర్పాట్లు చేశామన్నారు. గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. మండలంలోని 25 గ్రామాల పరిధిలో 5,500 మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని అన్నారు. జుఝవరంలో తప్ప మిగిలిన అన్ని గ్రామాల్లో పంట బోదెల పూడిక తీత పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డు అసిస్టెంట్‌లు, మేట్లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

269 మంది వలంటీర్లకు సేవా పురస్కారాలు

పామర్రు: మండలంలో 301 మంది వలంటీర్లు ఉండగా, వీరిలో 269 మందికి సేవా పురస్కారాలు వచ్చాయని పామర్రు ఎంపీడీవో వై.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. మండలంలో సేవా వజ్ర ఎవరికీ రాలేదని, సేవా రత్న పురస్కారాలు అయిదుగురికి వచ్చాయని చెప్పారు. వీరిలో జుఝవరం గ్రామానికి చెందిన గొర్ల శివాజీ, కొమరవోలుకు చెందిన వంగలపాటి కళ్యాణి, కొండిపర్రుకు చెందిన గుజవర్తి శైలజ, పామర్రు–1కు చెందిన లెంకా సునీత, పామర్రు–4కు చెందిన సూదులగంటి కోటి ప్రసాద్ ఉన్నారన్నారు. మండలంలోని 264 మందికి సేవా మిత్ర పురస్కారాలు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

మండవల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండవల్లి గ్రంథాలయాధికారి షేక్ పర్వీన అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన విజ్ఞాన శిబిరంలో పర్వీన మాట్లాడారు. పూర్వీకులు నిక్షిప్తం చేసిన గ్రంథాల ద్వారా జ్ఞానం సంపాదించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు చిత్ర లేఖనంపై అవగాహన కలిగించారు. గ్రంథాలయ విజ్ఞాన శిబిరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంపద తయారీ కేంద్రాల్లో త్వరితగతిన ఎరువు తీయాలి

మండవల్లి: చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాల్లో త్వరితగతిన ఎరువు తయారయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ బి.ఆనందబాబు అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గ్రేడ్ 1 నుంచి 5 వరకు కార్యదర్శుల సమావేశం శుక్రవారం నిర్వహించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 2023–2024 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ ఎస్.రవీంద్ర శుక్రవారం తెలిపారు. కాలేజీలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లిషు, తెలుగు మీడియంలో ప్రతి గ్రూపులో ఇంగ్లిషులో 44 సీట్లు, తెలుగులో 44 సీట్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విద్యార్థులు కాలేజీలో దరఖాస్తులు తీసుకుని కోర్సుల్లో చేరాలని ఆయన కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పామర్రులో విద్యార్థులతో మాట్లాడుతున్న అటవీ శాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్‌లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు



పెదపూడిలో దుకాణాల వద్ద ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు

అటవీశాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు

పామర్రు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని మచిలీపట్నం డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. పామర్రులోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని, మొక్కను నాటటమే కాకుండా దాని పరిరక్షణ బాధ్యతలను తీసుకోవాలని అన్నారు. వాతావరణంలోని కాలుష్య నివారణకు పచ్చని మొక్కలను పెంచాలన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ గురించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విజయవాడ అటవీశాఖ డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీ రాణి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

జమీగొల్వేపల్లిలో డ్రాయింగ్, పెయింటింగ్‌పై అవగాహన మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో పలు రకాల బొమ్మలను గీయించారు. పెయింటింగ్‌లు వేయించారు. అనంతరం విద్యార్థులు గీచిన చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషా దేవి, గ్రంథాలయ అధికారి వి.నాగ సురేష్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

పెదపూడి(మొవ్వ): పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడాలంటూ పెదపూడి సచివాలయ అధికారులు దుకాణాల వెంట తిరిగి దుకాణ యజమానులకు అవగాహన కార్యక్రమంతో పాటు ర్యాలీ నిర్వహించారు. మేరీ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వీఆర్‌వో జుజ్జువరపు కోటేశ్వరరావు, గ్రేడ్–5 కార్యదర్శి కళావతి, వెల్ఫేర్ అసిస్టెంట్ భాగవతుల ఆంజనేయులు, ఇతర సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు నిషేధించాలి

గుడివాడరూరల్: ప్లాస్టిక్ వాడకాన్ని ప్రజలు నిషేధించి పర్యావరణాన్ని పర్యరక్షించాలని ఎంపీడీవో అనగాని వెంకటరమణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్ మిషన్ లైఫ్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటేషన్, పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ పర్యావరణానికి ప్లాస్టిక్ వాడకం హానికరమన్నారు. ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. వర్తక, వ్యాపారులు సైతం ప్లాస్టిక్ వ్యాపారాలను పూర్తిగా నిషేధించాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్, పరిశుభ్రతపై సర్వే చేసేందుకు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి డీఈ అట్లూరి వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ దేవరపల్లి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కఠిన చర్యలు

మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ



ప్లాస్టిక్ విక్రయాలు చేస్తున్న షాపులను తనిఖీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

గుడివాడరూరల్: ప్లాస్టిక్‌ను వినియోగిస్తే దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గుడివాడ మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, పురపాలక సంఘ స్పెషలాఫీసర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు దుకాణాలపై కమిషనర్ నేతృత్వంలో శుక్రవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. దుకాణాల్లో 120 మైక్రోన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ సంచులను సీజ్ చేశారు. సంబంధిత దుకాణదారులకు అపరాధ రుసుం విధించారు. ప్రభుత్వం ప్లాస్టిక్ వస్తువులను నిషేధించిందన్నారు. ఇప్పటికే పలుమార్లు పట్టణంలో ఉన్న దుకాణదారులకు ప్లాస్టిక్ నిషేధంపై హెచ్చరికలు జారీ చేశామన్నారు. అయినా హెచ్చరికలను బేఖాతరు చేస్తూ కొంతమంది ఇంకా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు కఠినంగా తీసుకుంటామని స్పష్టం చేశారు, కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నందివాడ మండలంలో...

నందివాడ మండలం జనార్ధనపురం గ్రామంలో శుక్రవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఎల్‌పీవో కె.సంపత్‌కుమారి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి ప్లాస్టిక్ పెను విఘాతంగా మారిందన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆయా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది దుకాణాలపై దాడులు నిర్వహించి, ప్లాస్టిక్ వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావు, సచివాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అన్ని వర్గాలకు లబ్ధి

ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్



నిడుమోలులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్

నిడుమోలు(మొవ్వ): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమర్థుడైన పాలకుడని, ప్రజా సమస్యలు తెలుసుకుని అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. మొవ్వ మండలం నిడుమోలులో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, వలంటీర్లతో ఇంటింటికీ వెళ్లి మూడేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలను నేరుగా ఇంటి వద్దకే అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే చెందుతుందని, గతంలో జన్మభూమి కమిటీల చేతులు తడిపితే కాని పనులు అయ్యేవి కావని, నేడు మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమవుతున్నాయన్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రజలు గ్రామంలో తాగునీరు, అంతర్గత రహదారులు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రాజులపాటి పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, సర్పంచ్ కొమరగిరి అంజలి, వైస్ ఎంపీపీ డొక్కు వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్, గ్రామ సచివాలయ కన్వీనర్ గొరిపర్తి వెంకటేశ్వరరావు, షేక్ బేగం, పీఏసీఎస్ అధ్యక్షుడు పుట్టి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్నం రత్నాబాయి, నిరంజనరావు వరిగంజి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

డీఎస్పీ శ్రీకాంత్



బస్టాండ్ వద్ద పోలీస్ కంట్రోల్‌రూమ్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీకాంత్

గుడివాడరూరల్: పట్టణంలో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద పోలీస్ కంట్రోల్‌రూమ్‌ను శుక్రవారం డీఎస్పీ శ్రీకాంత్ పునఃప్రారంభించారు. ముందుగా పట్టణంలోని ప్రధాన కూడళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బస్టాండ్ వద్ద తరచు ప్రమాదాలు జరగడాన్ని గుర్తించామన్నారు. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగానే మూతపడిన పోలీస్ కంట్రోల్ రూమ్‌ను తిరిగి ప్రారంభించామన్నారు. సిబ్బందికి సైతం ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించామన్నారు. ప్రజల్లో సైతం ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేలా ట్రాఫిక్ పోలీసులతో ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించామని డీఎస్పీ వివరించారు. ప్రజలు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు దోహదపడాలని కోరారు. ఇకపై నిరంతరం ప్రజలతో మమేకమై ట్రాఫిక్ సమస్యలను గుర్తించి నివారణ చర్యలపై దృష్టి సారిస్తామన్నారు. వాహనదారులతో పాటు వర్తక, వ్యాపారులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండా సహకరించాలని డీఎస్పీ కోరారు. అనంతరం బాటసారుల కోసం ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని డీఎస్పీ ప్రారంభించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ బి.తులసీధర్, ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సబ్ రిజిస్ట్రార్‌లు సీతారామాంజనేయులు, శ్రీనివాసరావు

గుడివాడటౌన్: రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు ప్రారంభించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్–1 సీతారామాంజనేయులు, సబ్ రిజిస్ట్రార్–2 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఆర్ఐ నాగబాబు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మెయిన్ రోడ్‌లో వెలమ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో 30 రోజుల మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో మూకల సుబ్బారావు, అక్కమ్మ, రెడ్డి నరసమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు మజ్జిగ పంపిణీ చేశారు. స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను ప్రారంభించారు. ఉరిటి రామ్‌కుమార్ లక్ష్మీ మోహనరావు జ్ఞాపకార్థం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఉరిటి రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతల భాస్కరరావు, సింగిరెడ్డి గగారిన్, కొలుసు శివ, తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



గుడివాడలో నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడటౌన్: ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం నాయకులు అన్నారు. స్థానిక 16వ వార్డులో ద్రోణాదుల సుబ్బారావు స్థూపం వద్ద సుందరయ్య 38వ వర్ధంతి జరిగింది. తొలుత సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుందరయ్య సిద్ధాంతాలు యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. మతోన్మాద రాజకీయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఆ శక్తులను ఎదుర్కొనేందుకు యువత నడుం బిగించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి, సీఐటీయూ పట్టణ కార్యదర్శి లక్ష్మణరావు, సీహెచ్ శివ, డాక్టర్ శాంతి, పి.రజిని, బి.అరుణ, పి.వీరమ్మ, యూటీఎఫ్ నాయకులు నీలం ప్రభాకరరావు, సురేంద్ర, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో...

పామర్రు: దక్షిణ భారత దేశ కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని పామర్రులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చాట్లవానిపురంలో సీపీఎం శాఖ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి శాఖ కార్యదర్శి చాట్ల రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం కార్యాలయంలో సుందరయ్య చిత్ర పటానికి ముళ్లపూడి విల్సన్ పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఒగుడు గంగాధర ప్రసాద్, చాట్ల శ్రీనివాసరావు, కొక్కిలిగడ్డ రాఘవులు, దునుకు రఘునాథరావు, వేము పెదబాబు, కాటూరి నాగభూషణం, చికిరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కైకలూరు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.

సమష్టి కృషి అభినందనీయం



కల్వర్టును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లిరూరల్: ప్రజల ప్రయోజనార్థం సమష్టి కృషితో కల్వర్టు నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. ముదినేపల్లి మండలం అన్నవరం డ్రెయిన్‌పై కూలిపోయిన వంతెన స్థానంలో రైతులు సేకరించిన నిధులు, మండల పరిషత్ నిధులతో నిర్మించిన కల్వర్టును ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణానికి ఇప్పటికే కలెక్టర్‌తో సంప్రదించి రూ.50 లక్షల ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్టు ఆయన చెప్పారు. నిధులు మంజూరయ్యేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండలంలో తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. కల్వర్టు నిర్మాణానికి సహకరించిన చేపల చెరువుల రైతులు ఇతరులకు మార్గదర్శకమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ చొప్పర్ల సునీత, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు షేక్ అల్లాభక్షు, శీలం రామకృష్ణ, కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, మరీదు నాగయ్య, కొల్లి నాని, ఆనందదాసు సత్యనారాయణ, దివి సతీష్, రాచూరి కుమార్, రంగిశెట్టి నరసింహారావు, బేతపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చిగురుకోటలో అన్నసమారాధన

ముదినేపల్లిరూరల్: హనుమజ్జయంతి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ముదినేపల్లి మండలం చిగురుకోట వీరాంజనేయస్వామి ఆలయం వద్ద శుక్రవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. దీనిని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు వేలకు పైగా ప్రజలు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హతుని కుటుంబానికి సాయం



కైకలూరు(కలిదిండి): దారుణ హత్యకు గురైన బిరుదగడ్డ శేఖర్ కుటుంబానికి ప్రభుత్వం నుంచి మంజూరు చేసిన చెక్కును కోరుకొల్లు గ్రామంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శుక్రవారం అందించారు. తాడినాడ ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్‌వైజర్, దళితవర్గానికి చెందిన శేఖర్(24)ను గొల్లగూడెంకు చెందిన కట్టా రాము గొంతుకోసి హత్య చేసిన విషయం విదితమే. ఏలూరు ఆర్డీఓ పెంచిల కిషోర్ రూ.4,12,500 చెక్కును ఎమ్మెల్యే డీఎన్నార్ చేతుల మీదుగా శుక్రవారం మృతుడి తల్లి సువార్తమ్మకు అందించారు. ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి మరింత సాయం త్వరలో అందిస్తామన్నారు. హత్యలో సంబంధం కలిగిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా చర్యలు తీసుకుకోవాలని ఎస్పీని కోరామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అంకెం నరసయ్య, ఉపసర్పంచ్ చన్నంశెట్టి నాగరాజు, సోమేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ చన్నంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాకలో చెరువు స్థలం పరిశీలన

కైకలూరు: పెరిగిన జనాభాకు తగ్గట్టుగా తాగునీటి చెరువుల ఏర్పాటుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. ఆటపాక పక్షుల కేంద్రం సమీపంలో 15 ఎకరాల సొసైటీ చెరువును శుక్రవారం ఆయన పరిశీలించారు. త్వరగా పనులు చేపట్టాలని గ్రామపెద్దలకు చెప్పారు. కార్యక్రమంలో జాన్ విల్సన్, కన్నా రమేష్, సింగంశెట్టి రాము, బావిశెట్టి పాము, కొదమల సురేష్, కన్నా ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం ఏలూరురోడ్‌లో జగనన్న గ్రీన్ విలేజ్‌లో ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. త్వరగా నిర్మాణాలు చేపట్టుకోవాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



తోట్లవల్లూరులో సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి

తోట్లవల్లూరు: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ హాలులో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. విద్య, వైద్యం, ఇరిగేషన్, డ్రెయినేజీ, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఉపాధి హామీ, పశువైద్యం, ఐసీడీఎస్, హౌసింగ్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, విద్యుత్, ఆర్‌టీసీ తదితర శాఖలపై శాఖల వారీగా ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఉద్యానశాఖ తీరుపై కనకవల్లి సర్పంచ్ పెనమకూరి నరశింహాశర్మ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు కేవలం సమావేశాల్లో కనిపించటం తప్ప క్షేత్రస్థాయిలో రైతులకు ప్రభుత్వం అందించే రాయితీలపై అవగాహన కలిగించటం లేదని మండిపడ్డారు. విద్యుత్ శాఖ అధికారుల తీరుపై వైస్ ఎంపీపీ కళ్లం సాంబశివారెడ్డి, రొయ్యూరు సర్పంచ్ నిమ్మగడ్డ ప్రభుదాస్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రొయ్యూరులో ఒక విద్యుత్ స్తంభం మార్చాలని గత మూడేళ్లుగా చెబుతున్నా పట్టించుకోవటం లేదని ఆవేదన చెందారు. మొక్కజొన్న కొనుగోలుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలియజేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి పూర్తిస్థాయిలో నగదు చెల్లించిందన్నారు. రవాణా చార్జీలు, హమాలీల చార్జీలు, పీఏసీఎస్‌లకు కమీషన్ సైతం విడుదల చేశామని చెప్పారు. ప్రజాప్రతినిధులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి సూచించారు. ఈఓపీఆర్‌డీ రవికాంత్, వైస్ ఎంపీపీలు మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, కళ్లం సాంబశివారెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వరరావు, పీఆర్, హౌసింగ్, ఇరిగేషన్ ఏఈఈలు రాఘవరావు, భవానీప్రసాద్, మహేశ్వరి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.


సమయపాలన పాటించాలి



శ్రీహరిపురం సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

ముదినేపల్లిరూరల్: సచివాలయాల ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ పి.మల్లీశ్వరి అన్నారు. మండలంలోని శ్రీహరిపురం, దేవపూడి సచివాలయాలు, దేవపూడి పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల ఉద్యోగులతో మాట్లాడుతూ వలంటీర్లను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాల్సిన బాధ్యత సచివాలయాల ఉద్యోగులపై ఉందన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. రికార్డులు తనిఖీ చేసి సిబ్బందికి తగిన సూచనలు చేశారు. దేవపూడి పీహెచ్‌సీలో ప్రజలకు అందుతున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు.

అభాగ్యులను ఆదుకోవడం అభినందనీయం



రూ.50 వేల చెక్కును నిర్వాహకులకు అందజేస్తున్న కావూరి యోధనిర్మల్‌కుమార్, జ్యోతి దంపతులు

గుడివాడరూరల్: సమాజంలో మానసిక రుగ్మతతో బాధపడుతున్న అభాగ్యులను ఆదుకోవడానికి దాతలు చూపిస్తున్న దాతృత్వం అభినందనీయమని హనుమాన్ జంక్షన్‌కు చెందిన ఆశాజ్యోతి హ్యాండీక్యాప్‌డ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు అన్నారు. నందివాడ మండలం పోలుకొండ గ్రామానికి చెందిన ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు కావూరి యోధనిర్మల్‌కుమార్, ఆయన భార్య డెప్యూటీ తహసీల్దార్(విజయవాడ) జ్యోతి దంపతులు కావూరి భారతి వర్ధంతి సందర్భంగా ఆశాజ్యోతి హ్యాండీక్యాప్‌డ్ వెల్ఫేర్ సొసైటీకి రూ.50 వేలు చెక్కును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కావూరి మాట్లాడుతూ రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు తన తల్లిపేరిట నిర్వహిస్తానని తెలిపారు. కావూరి దంపతులను సంస్థ ప్రతినిధులు అభినందించారు.